క్లుప్తంగా

ఊరుగొండలో దొంగల హల్‌చల్



దామెర : విద్యుత్ మోటార్లను ధ్వంసం చేసి కాపర్‌వైరు, సర్వీసు వైర్లు ఎత్తుకెళ్లిన ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఊరుగొండలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పలువురు రైతులు ఎస్సారెస్పీ కెనాల్ నుంచి పంటలకు నీరు పెట్టిందుకు విద్యుత్ మోటార్లు అమర్చారు. ఆదివారం ఉదయం రైతులు వెళ్లి చూడగా 12 మంది రైతులకు సంబంధించిన విద్యుత్ మోటార్లు ధ్వంసం కావడంతో పాటు కాపర్ వైరు కనిపించలేదు. అలాగే పైప్‌పులు, మోటార్లు కెనాల్‌లో పడేసి ఉన్నాయి. 12 మోటార్ల విలువ సుమారు రూ.3లక్షల ఉంటుందని, అపహరణకు గురైన కాపర్‌వైరు విలువ సుమారు రూ.18,400 ఉంటుందని బాధితులు తెలిపారు. వీటితో పాటు 20 మీటర్ల సర్వీస్ వైరు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుల పక్షాన గ్రామానికి చెందిన మోటి రవి ఫిర్యాదుచేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వేలేరు : మండలంలోని పీచర జెడ్పీఎస్ఎస్ 2009–10 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 15 ఏళ్ల తర్వాత కలిసిన స్నేహితులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈనెల 7న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని డివిజన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాజీపేట దర్గా, హౌజింగ్ బోర్డు కాలనీ, గాంధీనగర్, బీజేపీ క్వార్టర్స్, బియాబాని నగర్, భీంనగర్, ఈపీఎఫ్ కార్యాలయ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు, బాపూజీ నగర్, బాలాజీనగర్, సోమిడి, గణేష్ స్వీట్ షాపు, సెయింట్ థామస్ స్కూల్, ఉప్పలయ్య హోటల్, కాజీపేట మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు, హనుమకొండ సుబేదారి శాంతినగర్, పోస్టల్ కాలనీ, ఎక్సైజ్ కాలనీ, అదాలత్ కూడలి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, విలీన గ్రామాలు కడిపికొండ రాజీవ్ గృహకల్ప, కడిపికొండ టౌన్, సూర్య కుటీర్, బోడగుట్ట, అయోధ్యపురం ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జార్జిరెడ్డి వర్ధంతి సభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఈనెల 10నుంచి 15వ తేదీ వరకు సభలను నిర్వహించనున్నారు. ఈమేరకు సభలను విజయవంతం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద సంఘం నాయకులు వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు, విద్యారంగ సమస్యలపై పోరాడిన జార్జిరెడ్డి ఆశయాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ బాధ్యులు ఉడుత గణేష్, రాజేష్, అనిల్, సాయితేజ, సందీప్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

డోజర్, టిప్పర్ సీజ్

మడికొండ: ప్రభుత్వ అనుమతి లేకుండా మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని రాంపేటలో మొరం తీస్తున్న డోజర్, మొరం తరలిస్తున్న టిప్పర్‌లను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం ఆదివారం ఉదయం మడికొండ పోలీసులు పెట్రోలింగ్ కొరకు వెళ్లగా రాంపేట గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా డోజర్ సహాయంతో మొరం తోడుతుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. అక్కడే ఉన్న టిప్పర్‌ను సైతం స్వాధీనం చేసుకున్నారు. డోజర్ డ్రైవర్ గాజ దిలీప్, టిప్పర్ డ్రైవర్ గోలి రాకేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

కాజీపేట: అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ పీసీసీ సభ్యుడు సయ్యద్ రజాలీని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కాజీపేట పట్టణంలో ఆదివారం పరామర్శించారు. ఆయనతో పాటు నాయకులు ఉన్నారు.

ఆత్మకూరు : సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు, హాజరైన భక్తులు



పరకాల : తాళి చూపుతున్న అర్చకులు





వేలేరు : కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఐనవోలులో..





ఐనవోలు : ఎమ్మెల్యేకు కంకణం కడుతున్న అర్చకుడు

కల్యాణం..కమనీయం

జిల్లాలోని పలు ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. పరకాలలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించగా, కమలాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్ పాల్గొని సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. వివిధ మండలాల్లో పలు రాజకీయ పార్టీల నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఆత్మకూరు : హాజరైన భక్తులు



కమలాపూర్ : తాళి చూపిస్తున్న అర్చకులు



శాయంపేట : మత్స్యగిరి స్వామి ఆలయంలో..



ఎల్కతుర్తి : గట్లనర్సింగాపూర్‌లో..



పరకాల : పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



శాయంపేట : కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



ధర్మసాగర్ : కల్యాణం జరిపిస్తున్న పండితులు



ఎల్కతుర్తి : కల్యాణాన్ని తిలకిస్తున్న గ్రామస్తులు



దామెర : ఊరుగొండలో..

ప్రాణ భయం ఉంది రక్షించండి



కమలాపూర్ : హనుమకొండ జిల్లా హసన్‌పర్తికి చెందిన కొందరి నుంచి తనకు ప్రాణ భయం ఉందని, వారి నుంచి తనను, తన కుటుంబాన్ని రక్షించి న్యాయం చేయాలని కమలాపూర్ మండలంలోని మాదన్నపేటకు చెందిన ఆత్మకూరు సురేశ్ పోలీస్‌లను వేడుకున్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. హసన్‌పర్తికి చెందిన తన మేనల్లుడు త్రాళ్ల సంతోశ్‌కుమార్, మరికొందరికి హసన్‌పర్తికే చెందిన కొందరు ముదిరాజ్ కులస్తులకు గొడవ జరుగగా ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నట్లు తెలిపారు. ఆ తర్వాత తన మేనల్లుడు సంతోశ్‌కుమార్ తన వద్దకు వచ్చాడని, ఆ తర్వాత ఫిబ్రవరి 17న హసన్‌పర్తికి చెందిన బస్సుకూరి వినయ్, సంగినేని శివ, శీలం శివసాయి మరికొందరు మాదన్నపేటలోని తన ఇంటి మీదకు కత్తులు, గొడ్డళ్లతో వచ్చి కులం పేరుతో దూషిస్తూ దాడి చేసి తనను, తన మేనల్లుడిని చంపుతామంటూ హత్య చేయడానికి ప్రయత్నించారని తెలిపారు. వారి వద్ద ఉన్న మారణాయుధాలను చూసి భయపడి తాము పారిపోగా, ఇది గమనించిన కొందరు కాలనీ వాసులు అక్కడకు రావడంతో వారు పరారయ్యారని తెలిపారు. ఆ తర్వాత రెండు రోజుల తర్వాత మరోసారి తనపై దాడి చేసేందుకు తన ఇంటి మీదకు వచ్చారని ఆరోపించారు. ఈ విషయమై తాను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కాగా ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ ఎలాంటి విచారణ చేపట్టకుండా కేవలం దాడి కేసు నమోదు చేశారని, వారిని కూడా ఇప్పటి వరకు అరెస్ట్ చేయలేదని తెలిపారు. వారితో తనకు, తన కుటుంబానికి ప్రాణభయం ఉందని, వారిని అరెస్ట్ చేసి తనకు న్యాయం చేయాలని కోరాడు. కాగా ఈ విషయమై ఇన్‌స్పెక్టర్ హరికృష్ణను వివరణ కోరగా.. సురేశ్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్ట్ చేశామని, మరొకరు పరారీలో ఉన్నారని తెలిపారు.

రామాలయానికి శేషవాహనం బహూకరణ



శేషవాహనాన్ని బహూకరిస్తున్న శ్రీనివాసులు దంపతులు

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన కుసుమ శ్రీనివాసులు–భారతి దంపతులు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్థానిక సీతారామచంద్రస్వామి దేవాలయానికి ఆదివారం రూ.65 వేల విలువచేసే శేష వాహనం బహూకరించారు. ఈ సందర్భంగా శేషవాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాత శ్రీనివాసులు మాట్లాడుతూ.. తమ పూర్వీకులు రామాలయానికి శేషవాహనాన్ని బహూకరించారని, ప్రస్తుతం ఆ శేష వాహనం శిథిలమైపోయిందని, నూతన వాహనం సమకూర్చాలని గతేడాది శ్రీరామనవమి సందర్భంగా ఆలయ అర్చకులు తనను కోరినట్లు చెప్పారు. అర్చకుల కోరిక మేరకు తాను నూతన శేషవాహనాన్ని రామాలయానికి బహూకరించానని తెలిపారు. కాగా శ్రీనివాసులు ప్రస్తుతం వ్యాపార రీత్యా హుజూరాబాద్‌లో స్థిరపడ్డారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు బొప్ప శివశంకర్, ఆలయ అర్చకులు పరాశరం సత్యనారాయణాచార్యులు, సీతారామాచార్యులు, వెంకటాచార్యులు, ఆదిత్య తేజ రాఘవాచార్యులు, మణికంఠ భిక్షమాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతున్న యువకుడి మృతి

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లబెల్లి మండలం రేలకుంటకు చెందిన కూచన నవనీత్ (21) మిత్రులతో కలిసి ఈనెల 4న బైక్‌పై నీరుకుళ్లకు ఓ శుభ కార్యానికి వచ్చారు. తిరిగి రేలకుంటకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలు కాగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మళ్లీ ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుని తల్లి కూచన స్వరాజ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు సీఐ సంతోశ్ తెలిపారు.

గీతకార్మికుడికి గాయాలు



వేలేరు : తాటిచెట్టుపై నుంచి జారిపడి గీతాకార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గుండ్లసాగర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిర్ర రాజు వృత్తిలో భాగంగా కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కుతున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారీ కిందపడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

బైక్‌ర్యాలీని జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేశవమూర్తి

ఆత్మకూరు : ఈనెల 12వ తేదీన హిందూ ధర్మరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న బైక్‌ర్యాలీని జయప్రదం చేయాలని గుడెప్పాడ్ రామాలయం అర్చకుడు ఆరుట్ల కేశవమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని గుడెప్పాడ్ రామాలయంలో ఆదివారం అందుకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 12వ తేదీన ర్యాలీ జరుగుతుందన్నారు. ర్యాలీ ఆలయం నుంచి ఆత్మకూరు వేణుగోపాలస్వామి ఆలయం వరకు కొనసాగుతుందని, హిందువులంతా అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనగాం సాంబయ్య, పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కుడా ఛైర్మన్ ఇనగాల



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కుడా ఛైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

ఆత్మకూరు : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అలాగే ఆత్మకూరు, గుడెప్పాడ్, అక్కంపేటలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



ముదిరాజ్ కులస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ

ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ

కమలాపూర్ : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ హెచ్చరించారు. కమలాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో తలెత్తిన విభేదాల నేపథ్యంలో ఇరు వర్గాలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. వ్యక్తిగత విషయాలు, వర్గ విభేదాలు, ఇతర నగదు లావాదేవీలకు సంబంధించిన సమస్యలను ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా, ఎవరికి ఇబ్బంది కలుగకుండా రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని అన్నారు. వ్యక్తిగత కక్షలను కులంలోకి తీసుకొచ్చి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు ఖాయం



పరకాల : ఆవిర్భావ దినోత్సవంలో బీజేపీ నాయకులు



కమలాపూర్ : జెండా ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్



వేలేరులో..

పరకాల : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఎన్ని మోసపూరిత వాగ్దానాలు చేసినా ప్రజలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కాళీప్రసాద్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సంతోశ్ కుమార్ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణంలో ఆదివారం నిర్వహించారు. పరకాల శక్తి స్థల్, బీజేపీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నిరంజన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గురుప్రసాద్, సత్యనారాయణరావు, నాయకులు విజేందర్‌రావు, రాజేందర్‌రెడ్డి, మేఘనాథ్, ఆర్పీ జయంత్ లాల్, పూర్ణాచారి, రామన్న, సతీశ్‌కుమార్, రాజభద్రయ్య, రవి, విజయ్, పురుషోత్తం పాల్గొన్నారు.

వేలేరు : బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామరావు, జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ పాల్గొని పార్టీ జెండా ఆవిష్కరించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. రానున్న రోజుల్లో బీజేపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర నాయకుడు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. మండల అధ్యక్షుడు రాజు, సురేశ్, కనుకచారి, శివాజీ, తిరుపతి, కోటి, వీరన్న, రాము పాల్గొన్నారు.

దామెర : వికసిత్ భారత్ నిర్మాణం బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని ల్యాదెళ్లలో ఆదివారం పార్టీ జెండా ఆవిష్కరించారు. పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, బూత్ అధ్యక్షుడు రోహిత్, శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

కమలాపూర్ : బీజేపీ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం కమలాపూర్, ఉప్పల్‌లో ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఇంటి ఆవరణలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ నాయకులు జెండా ఆవిష్కరించారు. మాదాసు ప్రణయ్, నాయకులు కోటేశ్వర్, మహేశ్వర్, రవీందర్‌రెడ్డి, నర్సయ్య, భాస్కర్, కుమారస్వామి, వెంకటనారాయణ, రాజేశ్, నరసింహ, సాగర్, నాగరాజు, రవీందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని పెంచికలపేటలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ పార్టీల నుంచి పలువురు నాయకులు బీజేపీలో చేరారు. వారికి ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాళీప్రసాద్ కండువాలు కప్పి ఆహ్వానించారు.

శాయంపేట : భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ సాంస్కృతిక వారసత్వం, జాతీయ అభిమానం, భారతీయత, అంత్యోదయ అనే అంశాలతోనే పార్టీ అవిర్భావించిందన్నారు. దేశాన్ని శక్తివంతమైన అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ దేశంలో అధికారంలో ఉండడం శుభ తరుణమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి, బీజేవైఎం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రవికిరణ్, నాయకులు రాజుపాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రంతో పాటు భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను జయప్రదం చేయాలి



మట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

వేలేరు : ఈనెల 27వ తేదీన ఎల్కతుర్తిలో నిర్వహించతలపెట్టిన రజతోత్సవ సభను జయప్రదం చేయాలని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని గుండ్లసాగర్ గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఏడాదిన్నర కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేఖత వచ్చిందని, పదేళ్ల కాలంలో కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చెప్పి సభకు స్వచ్ఛందంగా వచ్చే విధంగా నాయకులు కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ భూపతిరాజు, మండల కోఆర్డినేటర్ గొవింద సురేశ్, మాజీ సర్పంచ్ ధర్మారెడ్డి, నాయకులు ప్రభాకర్ రెడ్డి, జానీ, రాజు, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్–1 ర్యాంకర్‌కు సన్మానం



సన్మానిస్తున్న గడ్డం కేశవమూర్తి

శాయంపేట : గ్రూప్–1 స్టేట్ 4వ ర్యాంకు సాధించిన తహరాపూర్ గ్రామానికి చెందిన జిన్నా తేజస్వినిరెడ్డిని మండలంలోని గట్లకానిపర్తి గ్రామ అభివృద్ధి సభ్యుడు, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తేజస్వినిరెడ్డి మరెన్నో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని కోరారు. అనంతరం గట్లకానిపర్తి గ్రామంలో నిర్మించబోయే గ్రంథాలయ ప్రారంభోత్సవానికి రావాలని తేజస్విని కోరారు. ఈ కార్యక్రమంలో గట్లకానిపర్తి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పల్లకీ సేవ, తిరు కల్యాణ మహోత్సవం



గోవిందరాజ స్వామికి పల్లకీ సేవలో భక్తులు

వరంగల్ చౌరస్తా: వరంగల్‌లోని గోవిందాద్రి కొండపై స్వయంభూగా వెలిసిన శ్రీదేవి భూదేవి నీలాదేవి సతీ సమేతుడైన గోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం స్వామివారిని పల్లకీ సేవలో మేళ తాళాలు, మంగళ వాయిద్యాలతో, భక్త సందోహం నడుమ గోవిందరాజుల దేవాలయానికి చేర్చారు. గోవిందరాజ స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు ముదిరాజ్ కులపెద్ద చింతాకుల సునీల్ కుమార్, కాంగ్రెస్ నాయకుడు మీసాల ప్రకాష్ సమర్పించారు. అనంతరం గోవిందరాజ స్వామి తిరు కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులందరికి అన్నదానం చేశారు.